# “బైట”

“శ్రీ బుచ్చిబాబు”



“పాపం! ఇన్నిరోజు లుంటానని, నేనే అనుకో లేదు. బాబుని మీ దగ్గఱ వొదిలినందుకు నాకే కోపం గావుంది. మిమ్మల్ని వొదిలుండడం కష్టమా, పిల్లాడి నొదిలుండడం కష్టమా, గ్రహించడంలో కాలం గడుస్తోంది. ఏమైనాసరే, రేపు 10 గ॥ల బండిలో పూర్వం రాములవారు మాయలేడి మీదికి వొదిలిన బాణం లాంటి వేగంతో మీ హృదయసీమ మీదికి దూకుతా”

—వాణి.

సరే. ఇదీ, ఆవిడగారు మొదలు వ్రాసిన ప్రేమ లేఖ. ‘వాణి’ అన్న పేరుని బట్టిచూస్తే, అమోఘమైన లేఖలువ్రాసే కథానాయికని, మీకు స్ఫురించవచ్చు, నిజానికి, ఆవిడ పేరు ‘వాణీ’ కాదు మన్నూకాదు, పుట్టిన కొత్తల్లో, “ఉయ్యాలా తొట్టిలోంచి, యెదిగి యెప్పుడు నవయువ్వన వయస్కనవుతానా, అన్న వుత్సాంహాతో తన్నుకుని, క్రిందనున్న, వాళ్ళ తాతగారి తీగలులేని ప్రాత వీణమీదపడి, ఒక్క గాయమైనా తగిలించుకోకుండా, ఆయొక్క వీణని నిర్మూలం చెయ్యడంవల్ల, పెద్దలంతా కలబడి, ‘వీణా’ అని, నామకరణం చేసారట. పెద్దయింతర్వాత, చివరున్న ‘అ’ కారాన్ని ముందుకి తరిమి, కేవలం, ఒక, Stroke of genius వల్ల ‘వాణీ’ గా మార్చింది. ఇల్లాంటి విషయాల్లో, ఆవిడగారి తెలివితేటలు, కడుంగడు ప్రసంశనీయం.

ఇంతకీ బాబుగాణ్ణి బుజాన్నేసుగుని, స్టేషన్కి జేరుకుని, బండంతా కలబడి వెదిగినా, ఆవిడగారి

దర్శనం కాలేదు. ఆఖరకి ఆడాళ్ళ పెట్టెలోకి పరకాయించి చూసా. ఇంతలో పిల్లాడు, ఒకామె కేసి వేలుతో చూపిస్తూ

"నాన్నోయి, ఆ అమ్మ, అచ్చంగా మనమ్మలాగే వుంది కాదు..."

"ఏడిశావు, కుంక వెధవా," అని వాడి నోరు కట్టినకాడ్డీ ఆస్త్రీ 'ఓయబ్బ, చాలమందిని చూసానోయ్" లాంటి చూపులు, నాకేసి, చూసింది.

"ఇంటికి పద నాన్నా...అమ్మ, యింక హులక్కి..."

"ఊరుకోరా వెధవా...వెతుగుతాం, వుండరా."

"అల్లా బండిలో వెళ్ళిపోతుంటే నే...ఇంక మనతో రాదులే నాన్నా..."

చూడండి. యెంతవోర్పు. నిశ్చలతా, అవసరమో యిల్లాంటి సమయాల్లో, మొగాడికి, ఆసమయంలో, గాంధిమహాత్ముడికైనా, ప్రపంచం మొత్తంమీద కొంచెం కోపం రాకమానదు.

"ఏమండోయ్, కొంచెం, ఆ చేతిరుమాల, అందిస్తారు" అని నవ్వుతో సంబోధించింది ఓ చక్కని స్త్రీ. నేను రుమాలాతీసి ఆవిడ కివ్వబోతుంటే, మా వాడు దాన్నందుగుని, కొంచెం చీమిడి తుడిచి ఆవిడకిచ్చాడు. ఆవిడ నవ్వడం, యెంతలేదన్నా, నే నవ్వడం, మా వెధవ నవ్వడం, యింతలో, గార్డు యీలేసి రైలుని నడపడం జరిగేయి. అప్పట్లో, కోపమంతా, గార్డుమీద తిరిగిందని చెప్పక తప్పదు.

*　　*　　*

"ఏ రోజు నేది జరుగుతుందో చెప్పలేం సుమండీ! నిన్న మా అక్కయ్యా, పిన్నీ వొచ్చారు. మా అక్కయ్య మరదికి పిల్ల కుదిరిందిట! మా అక్కయ్య బైటుంది; నేకూడా బైటుంటానేమో? (నేను, మా అక్కయ్యా, ఓకేసారి బైటుండడం, మీ కెరుగున్న దేగా) పైగా, మా అమ్మమ్మ, సున్నుండలు తయారు చేస్తోంది. అని మీరు తింటేనేగాని, ఆవిడకి తోచదుట, ఇన్ని కారణాలచే, ఆగిపోవల సొచ్చింది. ఒక్కరోజు...కాదు కాదు...ఓక్కరాత్రి, ఓపిక పట్టండి, రేపు, పెట్టెలులేని యింజెన్ వేగంతో వొచ్చి వాల్తున్నా.

(మరిచా, బాబుని పక్కింటివాళ్ళ, అమ్మాయితో ఆడుకో నియ్యకండి. వాడు వాళ్లతో ఆడుకుంటుంటే, మీ రెందుకు, వూరుకుంటున్నారో నేనరుగుదును లెండి! అమ్మా, మీరా! నేనెంత ఆలశ్యం చేస్తే, అంత మంచిది మీకు! నే నొకవేళ, యింటికి దూరమైనా రేపు రాదలుచుకున్నాను, ఏందుకొచ్చినదీ వెధవ ఆచారం, చూడండి—పుస్తకాలల్లో మనం చదివేకథలలో, ఎక్కడైనా, మచ్చుకి, ఓ ఆడదైనా, ఎప్పుడైనా, ఒక్కసారి బైటుంటుందేమో? అసలు, పుస్తకాలల్లో ఆడాళ్లు, మాజాతికి సంబంధించిన వాళ్ళు కారండి."—వాణి.

ఇది, ఆవిడగారి, రెండో, Cxplanatory, లేఖ. ఇంత వుత్తరం, శ్రద్ధతో చదివితే, ఓ'ముద్దు' కూడాలేదు. పైగా, వెధవ గొడవ బోలెడు. ఎవడికి పిల్ల కుదిరితే ఎవడికేం కావాలి? అసలు, ప్రపంచంలోని, పదార్థాలన్నింటిలోకి, నేను మిక్కిలి అసహ్యించుకొనేది 'సున్నుండలు.' అది ఆవిడగారికి తెలుసు. పైగా పక్కింటివాళ్ల గొడవలో నన్నుకూడా యెల్లాగో దూర్చి, ఏదో నేరం నామీద మోపి ముందరకాళ్ళకి బంధం వెయ్యడం! ఖర్మంజాలక, ఒకప్పుడు పక్కింటి వాళ్ళమ్మాయి ముక్కు, సులోచన ముక్కులా, తీర్చివుంటుందన్నాను' 'సులోచన' యెవరో తెలియక పోయినాసరే, దాంతో కొంపలంటుకున్నాయి. అప్పట్నుంచి, వాళ్లు మాకు,- యెవరెస్టు శిఖరం ఇంగ్లీషువాళ్ళకి దూరమైనట్లు, దూరమై పోయారు.

"అవుతే కొంపంతా మైలుమయం చేసావన్న మాట! బైటుండిపోయావు—లేపోతే తెగేద్దును."

"అందుకనే ధైర్యం, నాకు" అని గది గుమ్మం లోకొచ్చి నిలబడింది. ఆవిడ సహజంగా రూపసేకాని, ప్రస్తుతం, అదేదో కావటంవల్ల, రైలుబొగ్గు, అడాళ్ల పెట్టెలో, చుట్టల తాలూకు కంపు,...వీటివల్ల, కొంచెం బాగా వుండలేదు, నాకళ్లకి.

"ఈ వెధవనీ, యీ పదార్థాన్ని లాక్కుపో, నువ్వు నాకింక కనబడకు. బైటున్నదాని మొహంచూస్తే, పంచమహాపాతకాలు."

"అబ్బో, అబ్బో, ముట్టయింది, లేంది, మహా మీరు కనిపెట్టినట్టు, మేం చెపితేనేగా, ఏదేనా."

"అవుతే, అవలేదన్నమాట." అంటూ, కొంచెం నవ్వు సాగించాను.

"అయ్యాసండి, కొంచం."

"కొంచమవడ మేమిటి నీమొహం."

"అంటే, బయల్దేరేప్పుడు మావాళ్లతో చెప్ప లేదు. మీకు యిష్టమేగా ముట్టకోడం, ముట్టు మూడు రోజులు, మీకు నరకమేగా."

"ఎవడా, అన్న వెధవ?"

"అంత మాటొద్దు; మీరే."

"ఓస్, యిదా, దూరంగావుండి రానీమాటలు. మా అమ్మొచ్చిందంటే, నిన్ను నన్ను తరిమేస్తుంది."

"మీ అమ్మతో చెప్పకపోతే సరి," అని, దిగ్విజయం గాంచిన దాన్లా చూసి నవ్వింది.

"మరి, బైట కూచోపోతే, అనుమానం పడుతుందేమో, మా అమ్మ." ఆవిడ సిగ్గుతో, తలొంచుకుంది.

"అసలు, ముట్టు కాలేదండి, మొన్న, వెళ్ళేటప్పుడేగా, బైటున్నది. అంతమరుపా మీకు."

"అయితే, నెలకి రెండు" అని పోకిరీగా నవ్వాను.

"చాలెద్దరు, మీరూ మీ మాటలూను, అంటే యింట్లో పనెక్కువయినప్పుడు, మీకు నామీద కోపం వచ్చినప్పుడు, ఏదేనా అసందర్భం జరిగినప్పుడూ, యింటిలోకి రాకుంటే మనస్సు, బోలెడు తేలిక పడుతుంది. ఇంట్లో లేపోతే, మాకు రెస్టు వుండదుగా."

"ఇందుకా, యిది! అవుతే దూరంగా వుండు."

"అబ్బే, యీతఫా నిజంగా బైటుండ లేదండి." అని వొచ్చి, పూర్తిగా నన్ను ముట్టుగుంది. వీధితలుపు చప్పుడవుతుందేమోనని భయం, నాకు. నిజానికి, యిన్ని రోజు లాలస్యంగా వచ్చిందన్న కోపంకంటె, అప్పట్లో, కోపం+విచారం, ఎక్కువయి, బొత్తిగా మతిచెడింది నాకు.

"అంటే, బండిదిగి, యింటికిరాగానే, బైటున్నానండి."

"ఓసి, నీ తధాకా...దిగవేం మంచం, దూరం. ముట్టుకున్నావంటే, మళ్లా ముట్టుకు చేయిచేసికోవలసొస్తుంది."

"అబ్బే, వొట్టిదండి, ఇప్పుడు లేదుకాని, రేపవుతానేమోనని భయంగావుంది. అట్టి సందర్భంలో మీ ముఖవైకల్యం యెల్లావుంటుందో చూద్దామని-అయితే, యేది."

"ఏమిటి." అన్నానేను.

"సున్నుండ."

"ఛీ, ఛీ."

"పోనీ. 'ముందరివ్వండి, ఒక గుద్దు' అనే వాక్యంలో మొదటి చివర అక్షరాలు కలపండి.

నా మాట పూర్తిగాకుండానే, ఆవిడిచెప్పిన కార్యం తాలూకుది జరిగింది.

"నాన్నోయి, ఇదిగో, సున్నుండ."

"ఒకటి తింటే, మీకు మరో..." చక్కిలి గింత, నవ్వులు, ముద్దుల హడావుడిలో, తిన్నాననే, నా నమ్మకం.

ఆ పదార్థాన్ని, గాంధీగారు, స్వయంగా, పెట్టినా, తిన దుల్చుకోని వ్యక్తిని, వృత్తి పుణ్యానికి, ఆ సందర్భంలో, తినాలిసొచ్చింది. చూడండి, యీ ముట్టు తథాకా. ఇదుండడం బట్టేకా, స్త్రీలకి, విశ్రాంతి. దంపతులకు, కొంతప్రణయగాథ, మూడుదినాలు యెడబాటు,మరల కలయిక,మొదలైన, సుఖాన్ని సమకూర్చే సంగతులు జరగటం. పూర్వం, మన పెద్దలు, వూరికే, ఏర్పాటు చెయ్యలేదు. కాబట్టి 'ముట్టు' అనే ఆచారాన్ని, పాటింపవలసినదే, అని మేం నిర్ధారణ చేసికొన్నాం. పత్రికలను, గాలి భవనాలను నిర్మించడానికి కాకుండా, చదువుకునేందుకే, వుపయోగిస్తే మంచిదని నా ప్రార్థన.

---


# అయఃకాంత ద్రావకం

ధాతువృద్ధికి సేవింపదగినది ద్రావకము ఇనుము. ఇనుము తిన్నవారికి నీరసము, ముసలితనము లేదని ఆగస్త్యాదులు వచించియున్నారు. కావున దీనిని సేవించుటచే భీమబలము సిద్ధించును.



ద్రావక సేవనమువలన గలుగు గుణములు.

ఉష్ణముచే వెంట్రుకలు రాలకుండ ఆగును, కాలుచేతులు, కండ్లమంటలు పోవును, ముఖమునకు తేజస్సు నిచ్చును, వాతమును, ఉష్ణమును పోగొట్టును, కాళ్ళు చేతుల దుర్బలము నడుచి నొప్పును పోగొట్టును ఆకలిని జీర్ణశక్తిని కలిగించును. సడలిన నరములకు సత్తువ జేయును. గుల్మము, గుండెనొప్పి కలవారు ఈ అయఃకాంత ద్రావకమును 8 రోజులు సేవించినచో జాలును. ధాతుపుష్టి లేని వారు 40 రోజులు సేవించిన జాలును.

(అర్ధ మండలం) 20 రోజులకు మందు 1-0-0.

(1 మండలం) 40 రోజులకు వచ్చుమందు 1-12-0.

ఆర్య బుక్ డిపో,

తిరువళ్ళిక్కేణి, : : : : మదరాసు.